ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 24 నవంబరు 2025



గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

● బాధ్యతలు స్వీకరించిన డీసీపీ



బాధ్యతలు చేపట్టిన డీసీపీకి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మహమ్మారిపై ఉక్కుపాదం మోపుతామని డీసీపీ రాంరెడ్డి తెలిపారు. ఆదివారం బాధ్యతలు తీసుకున్న అనంతరం డీసీపీ మాట్లాడారు. యువత ఉన్నత చదువులు చదువుకొని తల్లిదండ్రుల కల సాకారం చేయాలని సూచించారు. చెడు అలవాట్లకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారన్నారు. శాంతియుత వాతావరణంలో లా అండ్ ఆర్డర్ కొనసాగిస్తామని, ఏదైన సమస్యలు తలెత్తినప్పుడు నేరుగా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, మధ్యవర్తులను సంప్రదించవద్దని ఆయన స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదన్నారు. దొంగతనాలు, నేరాలు నియంత్రించేందుకు గ్రామాలు, పట్టణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

నగరపాలక సేవలకు టోల్‌ఫ్రీ నంబర్



కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో ప్రజా సేవలకు సంబంధించి తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలు టోల్‌ఫ్రీ, కాల్ సెంటర్, ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ కోరారు. పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, నీటి సరఫరా, వీధి దీపాలు వెలుగకపోవడం తదితర సమస్యలపై ప్రజలు కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారు ప్లేస్టోర్ నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సిటీజన్ బుడ్డి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు నమోదు చేయవచ్చునని, టోల్‌ఫ్రీ నెం.14420కు ఫోన్ చేయడం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని, 96036 66444, 9392483959 కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేస్తే ఫిర్యాదులు స్వీకరిస్తామని, ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

అంతర్గాం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతోపాటు లింగాపూర్ మోడల్ స్కూల్‌లో అసిస్టెంట్ కుక్, స్వీపర్ పోస్టుల ఖాళీలకు దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి ఏకారంభం తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 26 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, మరిన్ని వివరాలకు 7013592601 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ పోస్టులకు మండల పరిధిలోని మహిళలు 7వ తరగతి ఉత్తీర్ణత ఉండి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. బయోడేటాతోపాటు వారి ఆధార్, కుల, నివాస, 7వ తరగతి స్టడీ సర్టిఫికెట్ ధృవ పత్రాలు జత చేయాలని తెలిపారు.

పల్లెపోరుకు సన్నద్ధం

- గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు
- కుల గణన ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు
- గ్రామాల్లో మొదలైన సర్పంచ్ ఎన్నికల సందడి
- జిల్లాలో 263 గ్రామపంచాయతీలు
- ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు



మంథని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ పోరుకు సర్వం సిద్ధమైంది. కొన్ని నెలలుగా గ్రామాల్లో ఆశావహులను ఊరిస్తున్న పంచాయతీ ఎన్నికలకు ఎట్టకేలకు లైన్ క్లియరైంది. వచ్చే నెలలో పంచాయతీ సమరానికి నగారా మోగనుంది. రిజర్వేషన్ల పై రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో ఇవ్వగా, ఆదివారం జిల్లా అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానా లకు రిజర్వేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రిజర్వేషన్లు ఖరారు చేశారు.

జిల్లాలోని మంథని, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 263 గ్రామ పంచాయతీల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఆదివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సమక్షంలో 13 మండలాలకు సంబంధించిన అధికార యంత్రాంగం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభాను తీసుకోగా, 2014 చేపట్టిన కుల గణన లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.

జిల్లాలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాల్లో 4,91,651 మంది జనాభా ఉన్నారు. వీరిలో 94,104 మంది ఎస్సీలు, 10,115

(మిగతా 8వ పేజీలో)

సీపీఐ వందేళ్ల వేడుకలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

గోదావరిఖని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావుభవన్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక కుటుంబాల సమ్మేళనానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టులు కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మందిని చంపుతున్నా సుప్రీంకోర్టు సుమోటోగా కేసును స్వీకరించడం లేదన్నారు. 1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసి కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటాలు చేసిందన్నారు. శేషగిరిరావు, మఖ్దూం మోహియొద్దీన్, సర్వదేవబట్ల రామనాథం, నల్లమల్ల గిరిప్రసాద్, మనుబోతుల కొమరయ్య, విఠల్‌రావు లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధులు యూనియన్‌ను స్థాపించి కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారని, పలువురు కార్మిక నాయకులు ప్రాణ త్యాగం చేశారని ఆయన తెలిపారు. యూనియన్ శ్రేణులంతా పార్టీతో మమేకమై స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ మతోన్మాదాన్ని ముందు పెట్టి అభ్యుదయ వాదులందరినీ లేకుండా చేస్తుందని, ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీని పారిశ్రామిక ప్రాంతంలో బలోపేతం చేయాలని, అందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సీపీఐ వంద సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్‌జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షకార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ప్రకాష్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కే కనకరాజు, కన్నం లక్ష్మీనారాయణ, కందుకూరి రాజారత్నం, రమేష్, రంగు శ్రీను, ఓదెమ్మ, ఆసాల రమ, విజయలక్ష్మి, ప్రీతం, సూర్య, ఎంఏ గౌస్, ప్రజానాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, డప్పు రాజు, జూల మోహన్ పాల్గొన్నారు.

నాణ్యత లోపంతోనే కుంగిన చెక్‌డ్యామ్



మానేరు వాగులో డ్యామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి వల్ల మానేరు వాగుల్లోని ఎనిమిది చెక్ డ్యాములు కుంగిపోయాయని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గుంపుల వాగులో కృంగిన చెక్ డ్యామును ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 13 చెక్‌డ్యాంలు నిర్మించగా ఎనిమిది చెక్ డ్యాములు నాణ్యత లోపం వల్ల కృంగిపోయాయని తెలిపారు. చెక్‌డ్యామ్‌కు బాంబులు పెట్టి పేల్చిన ఆనవాళ్లు కనబడలేదని తెలిపారు. డ్యాముకు మధ్యలో, అలాగే ముందు భాగంలో బుంగలు ఏర్పడడం వల్ల చెక్ డ్యాం కూలిపోయిందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, పడాల రాజు, సింగల్ విండో డైరెక్టర్ బొంగోని శ్రీనివాస్, రెడ్డి రజినీకాంత్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఆదివాసీ నాయకుడు మడివి హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులను ఈ నెల 18న మారెడ్‌మిల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని పలు ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం అమరవీరుల స్థూపం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి మాట్లాడుతూ ఈ నెల 15న హిడ్మాతోపాటు పలువురిని పట్టుకుని కాల్చిచంపారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై హత్యాకాండను కేంద్ర ప్రభుత్వం సాగిస్తోందన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ మార్గాన్ని ఎంచుకుంటే, ప్రభుత్వం చేస్తున్నది హత్యలు కాదా అని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థల కోసమే గిరిజనులపై దమనకాండ సాగిస్తున్నదన్నారు. పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య, రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల మల్లన్న, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నకుమార్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు నారా వినోద్, యాదన వేణి పర్వతాలు, బండి శంకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

28న వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాకారులు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జానపద సకల వృత్తి కళాకారుల సంఘం ఆవిర్భావ రాష్ట్ర సదస్సును ఈనెల 28న కరీంనగర్ కళాభారతిలో నిర్వహిస్తున్నామని సుభాష్ చంద్రబోస్ జానపద సకల వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తాళ్లపల్లి సంధ్య పేర్కొన్నారు. ఆదివారం బస్టాండ్ కూడలి అంబేద్కర్ విగ్రహం ఎదుట పోస్టర్లు ఆవిష్కరించారు. సంధ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ద్వారా కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎంతోమంది జానపద వృత్తి కళాకారులు ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. మమత, బూడిద అనసూయ, రాజేశ్వరి, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- ఇళ్ల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం తోడు

ముత్తారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గూడు లేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పేదలకు వేగంగా సొంతింటిని అందించేందుకు కీలక చర్యలను చేపట్టింది. ఓ వైపు పేదింటి కల సాకారం చేస్తూనే.. మరో వైపు కూలీలకు ఉపాధి కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. కూలీల కొరత నివారిస్తూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం(ఈజీఎస్)ను అనుసంధానం చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉపాధిహామీ కార్డు ఉండి, ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులను ఉపాధిహామీ కింద 90 రోజుల పని కల్పిస్తూ వారి ఇంటి నిర్మాణంలో వారినే భాగస్వామ్యం చేస్తుంది. దీంతో లబ్ధిదారుడే తన ఇంటి నిర్మాణంలో భాగస్వామిగా మారి డబ్బులు సంపాదించుకునే అవకాశం లభిస్తుంది. మొత్తం 90 పని దినాలకు రూ.27,630 చెల్లించనున్నారు. ఇందులో బేస్మెంట్ స్థాయిలో 40 రోజులు, స్లాబ్ లెవల్ లో 50 రోజుల పనిదినాలు కల్పించనున్నారు. మండలంలోని మచ్చుపేటలో 39, అడవి శ్రీరాంపూర్‌లో 33, పోతారంలో 3 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. ఇందులో ఉపాధి హామీ కూలీలుగా ఉండి ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన వారిని గుర్తించి, 90 రోజుల పని దినాలను కల్పించనున్నారు.



బేస్మెంట్ స్థాయిలో ఇందిరమ్మ ఇల్లు

నిర్మాణంలో వేగం పెంచేందుకు దోహదం

- సురేష్, ఎంపిడివో, ముత్తారం.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కూలీల కొరత ఉంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకాన్ని లింక్ చేసింది. దీంతో మండలంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణం మరింత వేగంగా జరుగనుంది.

ఉపాధి కల్పించడం సంతోషం

సిత్తారి సమ్మక్క, లబ్ధిదారురాలు, అడవి శ్రీరాంపూర్.



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా ఉపాధి హామీ పథకానికి లింక్ చేయడం సంతోషకరం. దీంతో ఎక్కడికో వెళ్లి పని చేయకుండా తనకు మంజూరైన ఇంటి నిర్మాణంలో తానే భాగస్వామ్యమై ఉపాధి కూడా పొందుతాను.



బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్సులేవీ? 6
మక్కాన్‌సింగ్ నియామకంతో సంబరాలు 8

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



అయోధ్య, వారణాసి బస్సును ప్రారంభిస్తున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం అన్నారు. ఆదివారం గోదావరిఖని బస్టాండ్ నుంచి అయోధ్య, వారణాసి, ప్రయాగ్‌రాజ్ సూపర్ లగ్జరీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గోదావరిఖని బస్సు డిపో నుంచి పుణ్య క్షేత్రాలకు భక్తుల కోరిక మేరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని, డిసెంబర్ 6న హంపి, గోకర్ణ, ఉడిపి, మురుండేశ్వర్, శృంగేరి, ధర్మస్థల, కుకి సుబ్రహ్మణ్య, మంత్రాలయం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామని, పెద్దలకు రూ.6600, పిల్లలకు రూ.5000 చార్జి, 15న కాణిపాకం, అరుణాచలం, పలని, పాతాళశంభు, మధురై, రామేశ్వరం, శ్రీరంగం, శివకంచి, విష్ణుకంచి, జోగులాంబకు పెద్దలకు రూ.8వేలు, పిల్లలకు రూ.6వేలు ఉందన్నారు. 25న అన్నవరం, సింహాచలం, ఆర్‌కే బీచ్, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షరామం, అంతర్వేది, పాలకొల్లు, భీమవరం, విజయవాడ, అమరావతికి పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3200, 28న తిరుపతి, కాణిపాకం, అరుణాచలం పెద్దలకు రూ.6వేలు, పిల్లలకు రూ.4500 చార్జితో బస్సులను నడపనున్నట్టు తెలిపారు. అయ్యప్ప భక్తుల కోసం శబరిమలైకి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, పూరి, ఉజ్జయిని, ద్వారక, షిరిడి పుణ్యక్షేత్రాలకు ఖని బస్టాండ్ నుంచి త్వరలో ప్రత్యేక బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. వివరాలకు 7013504982, 7382847596, 7989847927, 9908138036 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ గీత కృష్ణ, మూర్తి, భక్తులు పాల్గొన్నారు.



బైక్ దొంగతనం చేసిన నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం మార్కండేయ కాలనీలో ఈ నెల17న అర్ధరాత్రి బైక్ దొంగతనం కేసులో నిందితుడు చెరుకుల సాయికిరణ్‌ను అరెస్టు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఐ కే రమేష్, క్రైమ్‌పార్టీ సిబ్బంది కేసును చేధించి మంద మర్రికి చెందిన సాయికిరణ్‌ను అరెస్టు చేశారన్నారు. నిందితుడి నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను రికవరీ చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

మహిళపై కూలీ దాడి

హుజూరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో ఆదివారం ఇంటి నిర్మాణానికి ప్లంబింగ్ చేసేందుకు వచ్చిన కూలీ ఓ మహిళపై దాడి చేశాడు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆదిరెడ్డి నూతన గృహాన్ని నిర్మించుకుంటున్నాడు. ఇంటికి ప్లంబింగ్ పని చేయడానికి మోరె శ్రీనివాస్ అనేవ్యక్తి వచ్చాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా పక్కనే ఉన్న ఆదిరెడ్డి భార్య వసంత గొంతు పట్టుకొని దాడి చేశాడు. వసంత కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి శ్రీనివాస్‌ను పట్టుకున్నారు. వసంత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ బాక్సులేవి?



- కొన్ని బస్సుల్లో ఖాళీ బాక్స్‌లు
- అధిక రద్దీతో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

సుల్తానాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులు అనేక ప్రమాదాలకు గురవుతున్నాయి. మరో వైపు అధిక రద్దీ మూలంగా చిన్నచిన్న ప్రమాదాలతో ప్రయాణికులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఆర్టీసీ బస్సుల్లో ఉండాల్సిన ప్రథమ చికిత్సకు సంబంధించిన బాక్సులు కానరావడం లేదు. కొన్ని బస్సుల్లో బాక్సులు ఉన్నా అందులో మందులు మాత్రం ఉండటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన అనంతరం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించింది. బస్సులన్ని నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.ప్రభుత్వం అదనంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న బస్సుల్లోనే రద్దీ పెరిగింది. చాలా మంది బస్సుల్లో నిలబడే ప్రయాణిస్తున్నారు. దీంతోపాటు రాజీవ్ రహదారిపైన ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురైన సంఘటనలు పెరుగుతున్నాయి. సుల్తానాబాద్ ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడం మళ్లీ బస్టాండ్ నుంచి రాజీవ్ రహదారిపైకి రావడం గగనంగా మారింది. ఈ రెండు మార్గాలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. పలు ప్రమాద సంఘటనల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందడం లేదు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రథమ చికిత్సకు సంబంధించిన బాక్సులు ఇతర మెడిసిన్ ఉండేది. ఆ బాక్సుల్లో అవసరమైన మందులు, కాటన్ తదితర పరికరాలు ఉండేవి. 70 శాతం బస్సుల్లో ప్రథమ చికిత్స బాక్సులు ఉండటం లేదు. దాంతో ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ప్రయాణీకులకు ప్రథమ చికిత్స చేయడం కుదరడం లేదు. ఆర్టీసీ అధికారులు బస్సుల్లో ప్రథమ చికిత్సకు సంబంధించిన కిట్లను అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో మెడికల్ కిట్ కు బదులుగా బస్సుకు సంబంధించిన టూల్స్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బల్ దేవుపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాళ్ల రవీందర్(36) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈనెల 11న పురుగుల మందుతాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రవీందర్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైనవైద్యం కోసం కరీంనగర్ అక్కడ నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దాదాపు 12రోజులపాటు చికిత్స చేయించారు. కానీపరిస్థితి విషమించి రవీందర్ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నంలోని మక్తక్రాస్ రోడ్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మారవేణి రవికుమార్ వ్యక్తిగత అవసరాల నిమిత్తం కేశవపట్నం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మక్త క్రాస్ రోడ్ వద్ద ఎదురుగా వచ్చి ఆటో రవికుమార్‌ను ఢీకొట్టింది. దీంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

- భార్య పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని సత్తేపీరీల దర్గా సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధానరహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పింది. ఈసంఘటనలో మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన దంపతులు కొండ హారిక-వంశీలకు తీవ్ర గాయాలయ్యాయి. హారిక పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తరలించారు. వంశీ తన భార్య హారికతో కలిసి ద్విచక్రవాహనంపై రాచర్ల గొల్లపల్లి గ్రామానికి వస్తున్నక్రమంలో ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

మీసేవ సెంటర్‌పై కేసు నమోదు

బీర్‌పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలోగల మీసేవకేంద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం ఎస్సై రాజు తెలిపారు. తుంగూర్ గ్రామ కార్యదర్శి కే మల్లికార్జున్ తన డిజిటల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తుంగూర్ గ్రామానికి చెందిన యశోద రాజన్న అనుపేరు మీద కొల్వాయి మీసేవ నిర్వాహకులు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేసి ఇచ్చారని శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మీసేవ కేంద్రంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

చొప్పదండి ఎమ్మెల్యే కాన్వాయ్‌లో ప్రమాదం

- ఒకరికి స్వల్ప గాయాలు

కొడిమ్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం కాన్వాయ్‌లోని కార్లు ఆదివారం ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తుండగా కొడిమ్యాల మండలం పూడూరు దగ్గర ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని ఒక కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొట్టింది. దీంతో కాన్వాయ్‌లోని కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో వాటిలోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకున్నాయి. కాన్వాయ్‌లోని ఒక కారులో ఉన్న కరుణాకర్ అనే వ్యక్తికి స్వల్పగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కారు ముందే వెళ్లిపోవడంతో ఆయనకు ప్రమాదం తప్పింది. సంఘటన స్థలాన్ని కొడిమ్యాల ఎస్సై సందీప్ పరిశీలించారు. కార్లు ఢీకొన్న సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కాన్వాయ్‌లోని కారు

46 జీవో ప్రతుల దహనం

గణేశ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం తీసుకొచ్చిన 46నంబరు జీవో పత్రులను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్యగౌడ్, ప్రధానకార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ చౌక్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకొచ్చిందన్నారు. బీసీవ్యతిరేక జీవో రావడానికి ప్రధాన కారణం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల కుట్ర ఫలితమేనన్నారు. ఢిల్లీలో 8వ తేదీన ధర్నా, 9వ తేదీన వేలాది మందితో పార్లమెంటు ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మంతెన కిరణ్, కార్యదర్శి వాయిల రాజ్ కుమార్, బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, కుసుంబ ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.


46 జీవో పత్రాలను దహనం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో
మెరిసిన ఉన్నతపాఠశాల విద్యార్థులు


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 52వ రాజ్యస్థైర్య బాల వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల18నుంచి 23వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగింది. ఈ ప్రదర్శనకు మెట్‌పల్లి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉన్నతపాఠశాల గైడ్‌టీచర్ ఇంద్రాల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్షిత, వాగ్దేవి పాల్గొని వారినైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇందులో మల్టీపర్పస్ క్రాప్ ప్రొటెక్టర్‌ను ప్రదర్శించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అలాగే పర్యావరణ సంస్కృతి సంరక్షణ నిర్వాహకులు విద్యార్థులకు యువశాస్త్రవేత్త ప్రశంసా పత్రాలతో సత్కరించారు. జాతీయస్థాయిలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకతార, జిల్లా విద్యాధికారి రాము, జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మండల విద్యాధికారి చంద్రశేఖర్ అభినందించారు. అలాగే 53వ జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వఉన్నతపాఠశాలలో ఈనెల28న జరగనున్నట్లు ఇందులో అన్నిపాఠశాలలు పాల్గొంటాయని జిల్లా విద్యాధికారి తెలిపారు.

రైతులకు నోటీసులు అందజేత

మల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ సెక్షన్ పరిధిలో గల రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో రైతులు ధాన్యం ఆరబెట్టుకోగా ధాన్యాన్ని తొలగించాలని అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు ఆదివారం రైతులు పేర్కొన్నారు. రహదారులకు ఇరువైపులా ధాన్యంను రైతులు ఆరబెట్టడంతో ఖాళీ లేకపోవడంతో అటవీశాఖ స్థలాన్ని చదునుచేసిన ధాన్యాన్ని ఆరబెట్టు కున్నారు. కాగా సమస్యను పరిష్కారం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పశువుల దొంగతనం

వెల్గటూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని కొత్తపేట, శాఖాపూర్‌గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి ఆరు బయటకట్టేసిన పశువులను దుండగులు వాహనాల్లో దొంగతనంగా తరలించారు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన బూట్ల రాజేందర్ రాష్ట్ర రహదారి పక్కనగల తన ఇంటి ముందు శనివారం ఆవు,దూడను కట్టేసి పడుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత లేచి చూస్తే ఆవు, లేగదూడ కనిపించ లేదు. రాత్రి తన భార్యతో కలిసి చుట్టుపక్కలా వెతికినా కనిపించ లేదు. దీనితో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శాఖాపూర్ గ్రామంకికల లచ్చయ్యకు చెందిన కోడెదూడ, అదేగ్రామం నబీసాహెబ్‌కు చెందిన రెండు కోడెదూడలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అర్ధరాత్రి వాహనాల్లో దూడలను తరలిస్తున్న సమయంలో అవి అరవడంతో సదరు రైతు బయటకు వచ్చి చూడగా అప్పటికే వాహనం వేగం పెంచి అపహరించినట్లు తెలిపారు. వెంటనే రైతులు పోలీసులకు సమాచారం ఇవ్వగా స్పందించిన పోలీసులు సదరు రైతులను వెంటబెట్టుకొని గాలింపు చేపట్టారు. అయినప్పటికీ పశువులను దొంగిలించిన వారి ఆచూకీ లభించలేదు. కాగా పశువులను దొంగిలిస్తున్న సమయంలో అవి అరవకుండా మత్తు మందు ఇచ్చినట్లు సమాచారం. కాగా ఆదివారం పశువులను దొంగిలించిన వారి క్లూస్ లభించినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

బిల్లులు రాక మాజీ సర్పంచుల తిప్పలు

- గ్రామాల్లో అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు
- కులవృత్తులు, ఇతర పనులతో ఉపాధి

చిగురుమామిడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గ్రామాల్లో గత ఐదేళ్లు అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచులు బిల్లులు రాక తిప్పలు పడుతున్నారు. ఇటీవల కొంత మందికి బిల్లులు వచ్చినా రానివారు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని ఆయాగ్రామాల సర్పంచులుగా పదవీకాలంలో అనేక అప్పులుచేసి అభివృద్ధి పనులు చేపట్టారు. పదవీకాలం ముగిసేవరకుకూడా బిల్లులు అందకపోవడంతో ఆవేదన చెందారు. ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో కొంతమంది కులవృత్తులు చేసుకుంటున్నారు. ఆర్థిక పరమైన ఇబ్బందులతో ప్రైవేట్ సంస్థల్లో జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు.


టైలర్ షాపు నడుపుకుంటున్న చిగురుమామిడి మాజీసర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్


ఎల్ఐసీ ఏజెంట్‌గా పాలసీలు చేయిస్తున్న గాగిరెడ్డిపల్లి మాజీసర్పంచ్ సన్నీల్ల వెంకటేశం


కులవృత్తి పని చేస్తున్న నవాబుపేట మాజీ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్

● బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నాం..

- బెజ్జంకి లక్ష్మణ్, మాజీ సర్పంచ్, చిగురుమామిడి

మండల కేంద్రాంలో సర్పంచ్‌గా అనేక అభివృద్ధి పనులు చేశాం. సకాంలో బిల్లు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇంకా బిల్లులు రావాల్సి ఉంది. ప్రస్తుత రాజకీయాలను తట్టుకునే ఆర్థిక స్తోమత లేక టైలర్‌షాపు నడుపుకుంటున్నా. స్థానిక సంస్థలకు పూర్తిస్థాయి అధికారాలు ఇస్తే సర్పంచులకు గౌరవం దక్కుతుంది..

● అధికారాలన్నీ అధికారులకే..

- సన్నీల్ల వెంకటేశం, మాజీ సర్పంచ్, గాగిరెడ్డిపల్లి

సర్పంచులు పేరుకు మాత్రమే. అధికారాలన్నీ అధికారులకే. మా పరిస్థితి ఉరు గొప్ప.. పేరు దిబ్బలా అయ్యింది. అభివృద్ధి పనులకు ముందుగా పెట్టుబడులు పెట్టాలి. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తున్నా. నాకు పదవీకాలంలో చేసిన బిల్లులు ఇంకా రావాలి.

● మాజీ సర్పంచులకు పింఛన్ ఇవ్వాలి..

- సుద్దాల ప్రవీణ్, మాజీ సర్పంచ్, నవాబుపేట

మాజీ సర్పంచులకు మాజీఎమ్మెల్యేలకు ఇచ్చినట్లు పింఛన్ ఇవ్వాలి. పదవీకాలంలో ఆర్థికపరమైన సమస్యలు, రాజకీయ సమస్యలు ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారు. స్థానిక సంస్థలకు పూర్తిస్థాయి అధికారాలు ఇచ్చి సర్పంచ్ పదవికి గౌరవం తేవాలి. గతంలో చేసిన అభివృద్ధి పనులు బిల్లులు పూర్తిగా రాలేదు.

ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కరువు

- రైతుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు


స్థలాన్ని పరిశీలిస్తున్న కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్(ఫైల్)

చిగురుమామిడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలంకరువైంది. దీంతో పండించినపంటను విక్రయించడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామశివారులోని సర్వేనంబరు 685లోని ప్రభుత్వభూమిలో 2.20ఎకరాలు కేటాయించాలని మహిళా సంఘాలు, రైతుసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, కులసంఘాల పెద్దలు ఉమ్మడిగా తీర్మానం చేశారు. మంత్రి పొన్నంప్రభాకర్, సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి వెంటనేచర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసినట్లు రైతులు, నాయకులు తెలిపారు. మంత్రి ఆదేశాలతో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులు సర్వేచేశారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి అనుమతులూ రాలేదు. కొనుగోలు కేంద్రంస్థలం కోసం గ్రామస్థులు ఆందోళన కార్యక్రమాలు సైతం చేపట్టారు.

ఆంక్షలు ఎందుకు ..

ఇదే సర్వే నంబరులో గత ప్రభుత్వం శ్మశానవాటిక, పల్లె ప్రకృతివనం, క్రీడాప్రాంగణం, వాటర్‌ట్యాంక్ నిర్మాణాలు చేపట్టింది. అప్పుడు లేని ఎఫ్‌టీఎల్ ఆంక్షలు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు ఎందుకని సంఘాల నాయకులు, రైతులు ప్రశ్నిస్తున్నారు.

పట్టించుకోవడం లేదు ..

- కత్తుల రమేష్ యాదవ్, గ్రామ రైతు సంఘం అధ్యక్షుడు

రాజకీయాలకు అతీతంగా కొనుగోలు కేంద్రం స్థలం కోసం ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్నాం. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, అధికారులకు వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సర్వే చేసినా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఊర చెరువు దగ్గర స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉందని చెప్పడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. రాజకీయ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

మహిళ మృతిపై కేసు నమోదు

సైదాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని రాములపల్లికి చెందిన చింతకుంట్ల సుకృత(49) అనే మహిళ మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి ఆదివారం తెలిపారు. సుకృత భర్త చింతకుంట్ల మహిపాల్‌రెడ్డి భూతగాదాతో ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశాడని ఆమె అక్క అలుమల్ల రమాదేవి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బంధువులు, స్థానికుల వివరాల ప్రకారం.. సుకృతకు మహిపాల్ రెడ్డి 20గుంటల వ్యవసాయభూమి ఇవ్వగా ఆ భూమిని ఆమె కూతురు విద్యకు రిజిస్ట్రేషన్ చేసింది. దీంతో మహిపాల్ రెడ్డి, సుకృత మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం సుకృత వ్యవసాయ పనుల నిమిత్తం వ్యవసాయభూమి వద్దకు వెళ్లింది. పక్కనే మహిపాల్‌రెడ్డి భూమి ఉండడంతో మహిపాల్‌రెడ్డి అక్కడికి వెళ్లాడు. సుకృత మహిపాల్‌రెడ్డి గొడవపడ్డారు. ఈ క్రమంలో మహిపాల్‌రెడ్డి సుకృత ఒంటిపై పెట్రోల్‌పోసి నిప్పంటి సజీవ దహనం చేశాడని, మహిపాల్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బంధువులు కోరారు.

శ్రీరాంసాగర్‌లో నిలకడగా నీరు

జగిత్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాలనుంచి ఆదివారం స్వల్పంగా నీరువస్తోంది. దీంతోడ్యామ్‌లో నీరునిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టునుంచి సరస్వతీకాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్‌భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 457క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.


ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

అనారోగ్యంతో వ్యక్తి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన


ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుడి నిర్లక్ష్యంతో మల్లాపూర్ మండలం ఫ్యాక్టరీ చిట్టాపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి శేఖర్(47) అనేవ్యక్తి మృతిచెందాడని ఆరోపిస్తూ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల శేఖర్‌కు శనివారం ఆయాసం, దమ్ము రావడంతో కుటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని శ్రీఆరోగ్య ఆసుపత్రికి తీసుకువచ్చి అడ్మిట్‌చేశారు. సాయంత్రం వరకు చికిత్స అందించిన ఆసుపత్రి వైద్యుడు డి అఖిల్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యంకోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించాలని చెప్పాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శేఖర్‌ను నిజామాబాద్ తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు బాధితులు పేర్కొన్నారు. కాగా శేఖర్‌కు డాక్టర్ చేసిన వైద్యం వికటించడంతోనే పల్స్ పడిపోయి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, అనిల్ అక్కడకు చేరుకొని బాధితులకు నచ్చజెప్పి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

కొండగట్టులో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజలు

- కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడిగా నియామకంతో అంజన్నను దర్శించుకున్న సత్యం


ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఆశీర్వదిస్తున్న అర్చకుడు

మల్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయస్థానాచార్యులు కపీందర్, ప్రధానార్చకులు జితేంద్రప్రసాద్, అర్చకుల బృందం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండగట్టు అంజన్న ఆశీస్సులతో నిరంతరం జిల్లా ప్రజల కోసం ముఖ్యంగా చొప్పదండి నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతానని అన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో దూసుకెళ్లే విధంగా పాటుపడుతున్నట్లు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ నాయకులు, అధిష్ఠానానికి ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వివిధ మండలాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఉన్నాయి.

● ఎమ్మెల్యేకు పెద్ద ఎత్తున అభినందనలు

కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులై మొదటిసారి కొండగట్టుకు వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పెద్ద ఎత్తున అభినందనలు అందుకున్నారు. మల్యాల, కొడిమ్యాల మండలాల నుంచి కొండగట్టు వచ్చిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. అంతకుముందు కరీంనగర్ క్యాంపునకు తరలివెళ్లి సత్యంనకు శుభాకాంక్షలు తెలుపగా భారీ కన్వాయ్‌తో అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు కొండగట్టుకు వచ్చి ఎమ్మెల్యేతో కలిసి పూజలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ఎస్ఐని టోపీ తీయమన్న ఈవో


● ఈవోతో పోలీసులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల వాగ్వాదం

● వివాదాస్పదం చేస్తున్నారంటూ ఈవో తీరుపై మండిపాటు


ఎస్ఐని టోపీ తీయమంటున్న ఈవో శ్రీకాంత్‌రావు

మల్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో శ్రీకాంత్‌రావు తీరుపై పోలీసులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర అసహనం వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యే బందోబస్తు కోసం వచ్చి విధుల్లో ఉన్న ఓ ఎస్ఐని తన తలపై ఉన్న టోపీ తీయమని ఈవో పేర్కొనడం వివాదానికి దారితీసింది. ఈవో అలా అనడాన్ని పోలీసులు ఆక్షేపించగా అక్కడ ఉన్నవారంతా ఈవో తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులు కావడంతో ఆంజనేయస్వామి దర్శనం కోసం ఆదివారం కొండగట్టు వచ్చారు. ఎమ్మెల్యే వెంట మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ బందోబస్తుగా వచ్చారు. ఎమ్మెల్యే ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న క్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు అక్కడకు చేరుకొని మొదట సీఐ రవితో టోపీ తీయాలని, అనంతరం ఆలయం నుంచి బయటకు వెలుతున్న కొడిమ్యాల ఎస్సై సందీప్‌ను కూడా టోపీ తీయాలని అనడంతో అక్కడ ఉన్నవారంతా ఈవో తీరును తప్పు పట్టారు. గతంలో ఎన్నడూలేని విధంగా దురుసుగా ప్రవర్తిస్తూ ప్రతీది వివాదస్పదం చేయడం ఏంటనీ ఈవోపై ఎమ్మెల్యే అనుచరులు, ఇతరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో తీరును తప్పు పడుతూ మండిపడ్డారు. అక్కడి నుంచి ఎస్సైని సీఐ రవి బయటకు తీసుకెళ్లారు. అనంతరం ఈవో తీరును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వివరించారు. కాగా ఈ విషయమై ఈవో శ్రీకాంత్‌రావును వివరణ కోసం సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. నెల రోజుల క్రితం కూడా దసరా సందర్భంగా పూజల కోసం ఎమ్మెల్యే వచ్చిన సందర్భంలో ఎమ్మెల్యేతో ఈవో వ్యవహరించిన తీరు అప్పట్లోనూ వివాదస్పదం అయింది.

న్యుమోనియా మరణాలకు చెక్



- తొలి దశలోనే గుర్తించేందుకు ప్రభుత్వం కసరత్తు
- గ్రామాల్లో సర్వే చేస్తున్న ఆశా వర్కర్లు

జగిత్యాలరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియాను తొలిదశలో గుర్తించి సమర్థవంతంగా చికిత్స అందించి మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్ఏఎన్ (సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్లీ) అనే కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. దీంట్లో భాగంగా వైద్య సిబ్బంది జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లో ఐదు సంవత్సరాలలోపు ఉన్న బాధిత చిన్నారులను గుర్తిస్తున్నారు. ఈనెల 14న కార్యక్రమం ప్రారంభమవగా 2026 ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుందని వైద్యాధికారులు తెలిపారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని 34 గ్రామ పంచాయతీల్లో 5,460 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఉన్నారు. ఇంటింటికీ తిరిగి ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది జ్వరం, దగ్గు, శ్వాస ఇబ్బందులున్న పిల్లలను గుర్తిస్తున్నారు. ఆక్సీమీటర్ ద్వారా ఆక్సిజన్ రక్తంలో ఎంతశాతం ఉందో పరిశీలిస్తున్నారు. న్యుమోనియా లక్షణాలున్న వారిని వైద్యులు గుర్తించి మందులు అందించడంతో పాటు తీవ్రత ఎక్కువగా ఉంటే ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నారు.

● ఎస్ఏఎన్ కార్యక్రమ లక్ష్యాలు..

ఎస్ఏఎన్ కార్యక్రమంలో భాగంగా న్యుమోనియా బాధితులను గుర్తించి చికిత్స అందించడం, ఆశా, ఏఎన్ఎంలతో పాటు వైద్యులకు నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇవ్వడం 6, 9, 14 నెలల్లో పీసీవీ టీకా పూర్తి చేయించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈకార్యక్రమాన్ని మూడు దశల్లో అమలు చేయాలని నిర్ణయించింది. చికిత్స కోసం మార్గ దర్శకాలు, సేవలందించే సిబ్బందికి నైపుణ్యంతో కూడిన శిక్షణను ఇవ్వడం వ్యాధి నివారణకు విస్తృత ప్రచారం కల్పించడం వంటి అంశాలు కార్యక్రమాలు లక్ష్యాలుగా పెట్టుకున్నారు.


జగిత్యాల రూరల్ మండలంలో న్యుమోనియాపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

న్యుమోనియా నివారణకు చర్యలు

-శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, జగిత్యాల



న్యూమోనియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో న్యుమోనియా చికిత్సకు అవసరమయ్యే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఒక్కరికి న్యుమోనియాపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

కోల్‌సిటీటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన క్రీడాకారిణి శ్రీపాద శ్రీజ ఎంపికయ్యింది. ఇటీవల వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో జరిగిన యూత్, జూనియర్ సీనియర్ 11వ రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో శ్రీజ 48కేజీ బాడీ వెయిట్ విభాగంలో పాల్గొని స్నాచ్ 60 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 65 కేజీలు మొత్తం 125 కేజీల బరువు ఎత్తి యూత్‌లో గోల్డ్, జూనియర్ విభాగంలో, సీనియర్‌లో వెండి పతకాలు సాధించిందని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి శారద ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీజను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అధ్యక్షుడు గాండ్ల రాజు, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కొండగట్టు ఏఈవోగా హరిహరనాథ్

మల్యాల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఏఈవోగా సుపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హరిహరనాథ్ బాధ్యతలు చేపట్టారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం నుంచి గతేడాది సాధరణ బదిలీల్లో కొండగట్టుకు రాగా రెండురోజుల క్రితం ఏఈవోగా దేవాదాయశాఖ పదోన్నతి కల్పించింది. దీంతో కొండగట్టు ఏఈవోగా నియమిస్తూ ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏఈవోగా పనిచేసిన ఏఈవో అంజయ్య పదినెలల క్రితమే పదవీ విరమణ పొందగా అప్పటి నుంచి ఏఈవో పోస్టు ఖాళీగా ఉంది.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

- హాజరైన 50 మంది క్రీడాకారులు


బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న మహిళలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించి విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను ఈనెల 28, 29, 30 తేదీల్లో సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ఉదయం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి అనంతరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల నిర్వహణలో ఫిజికల్ డైరెక్టర్లు జి శ్రీధర్‌రావు, డి సత్యానంద్, సీనియర్ క్రీడాకారులు బి జీవన్ కుమార్, ఎం సునీల్ కుమార్, పి భార్గవ్, కె అరుణ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన పురుషుల జట్టు

● రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక..

పురుషుల విభాగంలో వాసుదేవరెడ్డి, జీవన్ కుమార్, వెంకటేష్, సుహాస్, సంకీర్త, అక్షిత్ సాయి, నౌమాస్, సల్మాన్, అఖిల్, హర్షవర్ధన్, హనీష్‌రాజ్ ఎంపికగా స్టాండ్‌బైగా విఘ్నేష్ ఎంపికయ్యాడు. మహిళల విభాగంలో రింషా, భద్రాది బేస్, మీనాక్షి, మాయ, సుష్మ, అంజూశ్రీ, శ్రీజ ఎంపికయ్యారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు శ్వేతశ్రీ



సుల్తానాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి శ్వేతశ్రీ 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 విభాగంలో ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. ఇటీవల మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్వేతశ్రీ రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. ఈనెల 25 వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ శ్వేతశ్రీని అభినందిస్తూ భవిష్యత్‌లో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతీ పౌరుడు ప్రశ్నించే గొంతుక కావాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతీ పౌరుడు ప్రశ్నించే గొంతుక కావాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం ఆర్యవైశ్య సంఘం భవనంలో జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర మీడియా కమిటీ సభ్యుడు వడ్డిక అనిల్ రెడ్డి అధ్యక్షతన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లాస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య సమావేశంలో జిల్లా, సిరిసిల్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా బియ్యంకార్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లె బాలకిషన్, ఉపాధ్యక్షులుగా కొంపెల్లి శివకుమార్, మిర్యాల దేవయ్య, జాయింట్ సెక్రెటరీగా గంగుల కనకరాజు, జిల్లా అధికార ప్రతినిధిగా గద్దల గణేష్‌ను ఎన్నుకున్నారు. సిరిసిల్ల పట్టణ కమిటీ అధ్యక్షుడిగా చిప్ప దేవదాస్, ప్రధాన కార్యదర్శిగా నల్ల మురళి, ఉపాధ్యక్షులుగా వేములు పోశెట్టి, అలువాల రామస్వామి, సహాయ కార్యదర్శి సిద్దిరాల సారయ్య, అధికార ప్రతినిధి మడికొండ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా, పట్టణ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులకు రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పౌరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో ఉన్న అవినీతి అక్రమాలను పారదోలడానికి కమిటి సభ్యులు కంకణబద్ధులై ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, విద్యావంతులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న భద్రయ్య

గోదావరి నదిలో మల్లన్న భక్తుల స్నానాలు


గోదావరి నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో మల్లన్న భక్తులు ఆదివారం స్నానాలు ఆచరించారు. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని గోదావరి నదికి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని త్రిశూలం చేత పట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేశారు. అనంతరం మల్లన్న పట్నాలు వేసుకునేందుకు గ్రామాలకు బయలుదేరారు.

గిరిపుత్రిక.. యోగాలో చిచ్చర పిడుగు

- జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ



యోగా పోటీల్లో విద్యార్థిని మనస్విని ప్రదర్శన, ప్రశంసా పత్రంతో మనస్విని

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు23(ఆంధ్రజ్యోతి): మారుమూల అటవీ గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఎలాంటి వసతులు లేకుండానే చదువుతో పాటు యోగాపై మక్కువతో ఆ దిశగా రాణిస్తోంది. అంతర్జాతీయ వేదికపై తన అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుంటోంది వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని బట్టు మనస్విని.

● తండా నుంచి అంతర్జాతీయ స్థాయికి..

వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలోని నిరుపేద దంపతులు బట్టు సుష్మ-రమేశ్ దంపతుల కూతురు మనస్విని. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. యోగాలో ఆమె ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. మెలకువలను నేర్చుకున్న విద్యార్థిని మనస్విని పదో ఏట యోగా పోటీల్లో పాల్గొంది. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన దైన ప్రతిభను కనబర్చుస్తూ సత్తా చాటుతోంది. పలువురి మన్ననలు పొందుతోంది. ఈ యేడాది సెప్టెంబరు 6 నుంచి 8 వరకు రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జూనియర్ విభాగలో తృతీయ స్థానంలో నిలిచింది. ఇటీవల గిరిజన పోరాటయోధుడు బిర్సా ముండా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నవంబరు 11 నుంచి 15 వరకు ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలా మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది.

జీవో నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలి

గణేశ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి సంవత్సర కాలం నుంచి ఊరించి తూతూ మంత్రంగా జీవోను జారీ చేసిందన్నారు. జీవో నంబర్ 46 బీసీలకు ఉరితాడుగా మారిందన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కేసు ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా ప్రభుత్వం హడావుడిగా రిజర్వేషన్లను తగ్గించిందన్నారు. 60 శాతం ఉన్న బీసీలను అవమానించి వారిని మోసం చేసిందన్నారు. జీవోను రద్దు చేసే వరకు బీసీలందరూ పార్టీలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్.. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్



మిట్టపల్లి శ్రీనివాస్, కొంపెల్లి చిరంజీవి

కరీంనగర్ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్ (ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట), జనరల్ సెక్రెటరీగా కొంపెల్లి చిరంజీవి(ఎక్సైజ్ ఎస్ఐ, సుల్తానాబాద్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నిక సమావేశంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ కమిటీకి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టీ రాజేందర్(ఎక్సైజ్ ఎస్ఐ, జగిత్యాల), ఉపాధ్యక్షుడిగా వి రాజశేఖర్‌రావు (ఎక్సైజ్ సీఐ, వేములవాడ), కోశాధికారిగా తమ్మిశెట్టి వినోద్ (ఎక్సైజ్ ఎస్ఐ, హుజురాబాద్) సంయుక్త కార్యదర్శిగా సర్వేశర్‌రావు(ఎక్సైజ్ సీఐ, జగిత్యాల), ప్రచారకార్యదర్శిగా వంగ రవి(ఎక్సైజ్ ఎస్ఐ, వేములవాడ), కార్యవర్గ సభ్యులుగా బాబా(ఎక్సైజ్ సీఐ, తిమ్మాపూర్), సీహెచ్ మంగమ్మ(ఎక్సైజ్ సీఐ, రామగుండం), ఎంఏ జమీల్ (ఎక్సైజ్ ఎస్ఐ, ధర్మపురి), కె పావని(ఎక్సైజ్ ఎస్ఐ, పెద్దపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ టీ శ్రీనివాస్, కరీంనగర్ అర్బన్ సీఐ ఎ రాములు వ్యవహించారని తెలిపారు.

హ్యాండ్‌బాల్ సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని విపార్క్‌లో సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడిగా వీర్ల వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బసరవేణి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా కొత్త సతీష్ రెడ్డి, కాసర్ల ఆనంద్ కుమార్, తుమ్మ కనుకయ్య, కొమురయ్య, కోశాధికారిగా నమిలకొండ ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా యుజన క్రీడాశాఖ నుంచి అథ్లెటిక్ కోచ్ పవన్ కుమార్, అడ్వకేట్ మహేందర్ పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యవర్గ సభ్యులు

ఎస్‌జీఎఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి

ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి వాలిబాల్ పోటీలు ధర్మారం మండలంలో జరగడం శుభపరిణామమని ఈ అవకాశాన్ని మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవి జనార్దన్, పాలకుర్తి రాజేశం గౌడ్, కొత్త నర్సింహులు, ఓరెం చిరంజీవి, ఎండీ బాబ, దేవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఎల్‌ఈడీలో రాజన్న దర్శనం

- భీమన్న సన్నిధిలో భక్తజన సందడి



ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, భీమన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు వేములవాడకు చేరుకున్నారు. దీంతో దేవాలయాల్లో సందడి నెలకొంది. ముందుగా ప్రచార రథం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వరస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి తలనీలాలు సమర్పించి అన్నపూజ, అభిషేకం పూజలు చేశారు. స్వామివారిని దాదాపు 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు.

బద్దిపోచమ్మకు బోనాలు

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులు తీరారు. ఆలయంలో వేలాది మంది భక్తులతో రద్దీ ఏర్పడింది.

సెయింట్ క్లేర్‌లో ఎన్‌సీసీ డే వేడుకలు



ఎన్‌సీసీ కెడెట్లతో అధికారులు

జ్యోతినగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్యాడెట్ కార్ప్స్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఎన్‌టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో ఆదివారం ఏఎస్‌ఓ శ్యాం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ రేపా ఏ డోమినిక్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో యువతకు క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే క్రమశిక్షణ, దేశభక్తిగల పౌరుల అవసరం ఎంతో ఉందన్నారు. రెండు సంవత్సరాలుగా ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అతిథులుగా రేవ్ ఫా రాయప్ప, సోలో మాన్‌రాజ్ జేష్ట తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై పునరాలోచన చేయాలి

సుల్తానాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ విదేశీ వలస వాదులతో కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, స్వదేశీ జపం చేసే బీజేపీ సర్కార్ రద్దు చేయడం కార్మిక వ్యతిరేక చర్యగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా మార్చడం, 8 నుంచి 12 గంటల పనిదినాలు పెంచడం, సమ్మె హక్కు, ప్రశ్నించే హక్కు, ఉద్యోగ భద్రత హక్కు ఇలా కార్మిక వర్గం నిత్యం ఎదుర్కొంటున్న ప్రధాన హక్కులను హరించి వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని కార్మిక సంఘాలు బీజేపీ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

నాలుగు కాళ్లతో కోడిపిల్ల

ఎలిగేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి సతీష్‌కు చెందిన ఓ కోడిని పొదిగేశాడు. ఈ మేరకు గత రెండు రోజుల క్రితం అన్ని పిల్లలు సవ్యంగానే పుట్టగా, ఒక కోడిపిల్లకు మాత్రం నాలుగు కాళ్లు ఉన్నాయి. విషయం తెలియడంతో ప్రజలు వచ్చి కోడిపిల్లను చూస్తున్నారు.

హిందువులంతా సంఘటితం కావాలి

సుల్తానాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హిందువులంతా సంఘటితం కావాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ విభాగ్ సహా వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళీధర్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జనజాగరణ అభియాన్ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. సుల్తానాబాద్‌లోని పెరుకగిద్దె హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పట్టణంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందించారు. హిందూ సమాజం సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. అఖండ భారత్ సాధనే ధ్యేయంగా ఇంటి ఇంటికి తిరుగుతూ హిందువులను జాగృతం చేశారు.

పోరాట యోధురాలు ప్రమీలదేవి



ప్రమీలదేవి చిత్రపటానికి పూల మాల వేస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకురాలు ప్రమీలదేవి పోరాట యోధురాలు అని సీపీఐ నగర అధ్యక్షుడు కనకరాజు అన్నారు. ప్రమీల దేవి 3వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని అశోక్‌నగర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేశారని, సారా వ్యతిరేక ఉద్యమంతో పాటు పారిశ్రామిక ప్రాంతంలో అనేక సమస్యలపై కీలక పాత్ర పోషించారన్నారు. గోషిక మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, శనిగరపు చంద్రశేఖర్, రాజ్‌కుమార్, రమ, లెనిన్, జైపాల్‌రెడ్డి, రాజమ్మ, బీ పాషా, శంకరమ్మ, లక్ష్మి, శ్రీలత, భారతి, రజిత పాల్గొన్నారు.

కార్మిక చట్టాలతో పరిశ్రమల పురోగతి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడంతో పరిశ్రమల పురోగతి, దేశ అభివృద్ధికి ఊతంగా ఉన్నాయని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆదివారం కాలనీ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొత్తం 49 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా ఏకీకరణ జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు పొన్నమనేని వేణుగోపాలరావు, మాదాసి రవీందర్, వడ్డేపల్లి కుమారస్వామి, గట్టు శ్రీనివాస్, నీలం రవి, అబ్బో శివాజీ, లింగం నాయక్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రూప్లానాయక్

ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కేపీఆర్ హాస్పిటల్ - ఎన్‌ఆర్‌ఐ కొలుముల దామోదర్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం చామనపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ వంశీధర్‌రెడ్డి, డాక్టర్ గీతారెడ్డిలతో కలిసి ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ ప్రారంభించారు. చామనపల్లి గ్రామంతో పాటు ఇతర గ్రామాల నుంచి 5 వందలకు పైగా పేషెంట్లు తరలిరాగ వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, వేల్పుల నాగరాజు, పాలముకుల మధవరెడ్డి, వెంకటిరెడ్డి, కొమ్ము లచ్చయ్య, వేల్పుల రమేష్, పనస సాగర్, బేధగం అంజి, మారం సాగర్, అనంతుల శ్రీధర్, గౌడ నర్సింగం, పాలమాకుల సందీప్‌రెడ్డి, గొల్లపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి జన్మదినం

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ యూత్ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జెండా చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ, పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యాల నరేష్, మండల అధ్యక్షుడు జడల రాజు, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, పట్టణ అధ్యక్షుడు శ్రావణ్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్‌తోపాటు ఆయూబ్, రాజ్ కుమార్, సతీష్, పవన్ కుమార్, ప్రణయ్, సాయిరాం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామపంచాయతీల సర్పంచ్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఇందులో ఆశన్నపల్లి, మంగపేట, మడిపల్లి, ఇప్పలపల్లి, చిన్నరాత్‌పల్లి, మల్యాల జనరల్, పెద్దంపేట, గంగారం, అంకంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, తారుపల్లి, లక్ష్మీపూర్ జనరల్ మహిళ, వెన్నంపల్లి, పెద్దరాత్‌పల్లి, మీర్జంపేట, ఆరేపల్లి బీసీ మహిళ, పెగడపల్లి, మడిపల్లికాలనీ, శ్రీరాంపూర్, మొట్లపల్లి బీసీ జనరల్, ఇదిలాపూర్, కిష్టంపేట ఎస్సీ మహిళా, కూనారం, పందిల్ల ఎస్సీ జనరల్ రిజర్వేషన్లు ప్రభుత్వం అమలు చేయనున్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఎలిగేడు, సుల్తాన్‌పూర్ ఎస్సీ జనరల్, ర్యాకల్‌దేవుపల్లి ఎస్సీ మహిళా, లాలపల్లి, రాములపల్లి, నర్సాపూర్, లోకపేట ఓసీ జనరల్, శివపల్లి, ముప్పిరితోట, బుర్హాన్‌మియాపేట జనరల్ మహిళ, ధూళికట్ట జనరల్, నారాయణపల్లి బీసీ మహిళకు రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిసింది.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామాల్లోని పంచాయితీలకు రిజర్వేషన్లను విడుదల చేసింది. ఆదివారంపేట్ (ఎస్సీ జనరల్), జల్లారం (ఎస్సీ మహిళ), నాగెపల్లి, నవాబ్‌పేట్, పెద్దంపేట్ (జనరల్ మహిళ), సుందిల్లా, ముస్త్యాల, లద్నాపూర్ (జనరల్), రత్నాపూర్, పన్నూర్, కల్వచర్ల (బీసీ జనరల్), బేగంపేట్(జనరల్ ఓసి), బుధవారంపేట్ (ఎస్‌సి జనరల్), చందనాపూర్ (బీసీ మహిళ), లొంకకేసారం (బీసి మహిళ)గా కేటాయింపు చేపట్టారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని 27గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించి జిల్లా యంత్రాంగం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసింది. నీరుకుల్ల, గట్టేపల్లి, అల్లీపూర్ ఎస్సీ జనరల్, కాట్నపల్లి, కొదురుపాకలు ఎస్సీ మహిళ, బీసీ జనరల్ భూపతిపూర్, దేవునిపల్లి, ఐతరాజుపల్లి, కదంబాపూర్, బీసీ మహిళలకు చిన్నకలువల, చిన్నబొంకూరు, రేగడిమద్దికుంట, తొగర్రాయి గ్రామాలు కేటాయించారు.

దుబ్బపల్లి, గొల్లపల్లి, కందునూరిపల్లి, కనుకుల, మంచరామి, రామునిపల్లి, సాంబయ్యపల్లి గ్రామాలను జనరల్ మహిళలకు, జనరల్ బొంతకుంటపల్లి, గర్రెపల్లి, మియాపూర్, నారాయణపూర్, నారాయణరావుపల్లి, నర్సయ్యపల్లి, రామునిపల్లి, సుద్దాల కేటాయించారు.

మంథని/మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్లు ఆదివారం ఖరారయ్యాయి. బెస్తపల్లి, కాకర్లపల్లి, చిల్లపల్లి, గద్దలపల్లి, పోతారం, మైదుపల్లి, గాజులపల్లి, గుమ్నూరు, మల్లెపల్లి, అడవిసోమన్‌పల్లి జనరల్, అక్కెపల్లి, బిట్టుపల్లి, రచ్చ పల్లి, గుంజపడుగు, దుబ్బపల్లి, ఉప్పట్ల జనరల్ మహిళ, ఎక్లాస్‌పూర్, సిరిపురం, విలోచవరం, చిన్నఓదాల, ఖానా పూర్, మల్లారం, నగరంపల్లి ఎస్సీ మహిళ, పుట్టపాక, సూరయ్యపల్లి, నాగెపల్లి, ఖాన్‌సాయిపేట, ఆరెంద ఎస్సీ జనరల్, తోటగోపయ్యపల్లి, కన్నాల-బీసీ జనరల్, లక్కె పూర్-బీసీ మహిళ, గోపాల్‌పూర్-బీసీ జనరల్, భట్టుప ల్లి, నాగారం జనరల్ మహిళ, వెంకటాపూర్-ఎస్టీ జన రల్, ఖరారు చేశారు. అయితే ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



కలెక్టరేట్‌లో సత్యసాయి జయంతి వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి నిర్వహించారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు సాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమాజానికి చేసిన మంచిని వివరించారు. జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి సురేష్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, జిల్లా సత్యసాయి సేవా ట్రస్టు కన్వీనర్ లక్ష్మీనారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య భవన్‌లో గల వాసవి మాత ఆలయంలో ముందుగా సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి భజనలు చేశారు. బైక్ ర్యాలీలతో పోలీస్‌స్టేషన్ మీదుగా ఆసుపత్రికి చేరుకొని అల్లెంకి సుశీల భూమయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు, బంధువులతో పాటు ఆర్యవైశ్య ఆధ్వర్యంలో రోగులకు దుప్పట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అల్లెంకి వీరేశం, సత్తన్న, అన్నమనేని రవీందర్ రావు, చకిలం మారుతి, బోడ్ల శ్రీనివాస్, శివనాత్రి ప్రసాద్, ప్రశాంత్, అరుణ్, రాములు, రమేష్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న సేవకులు

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



ముత్తారం, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్‌ఐ ఎన్.రవికుమార్ అన్నారు. మండలంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. ఒకవేళ మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు యాజమానులపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ



నిరసన తెలుపుతున్న నాయకులు

కమాన్‌పూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీల మోసాలపై బీసీ సమాజం మేల్కొనాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ నల్లవెల్లి శంకర్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో 46 ప్రతులను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతం ఉండగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 9 విడుదల చేసిందన్నారు. ప్రస్తుతం ఆ జీవోను రద్దు చేసి 46 జీవో తీసుకువచ్చి బీసీల రాజకీయ అణిచివేతకు పాల్పడుతున్నారన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు తోట రాజ్‌కుమార్, కార్యదర్శి మానుక ఓదెలు, మాజీ వార్డు సభ్యులు సుంచు శ్రీనివాస్, రాచకొండ సమ్మయ్య, ఆసం శ్రీనివాస్, వడ్లకొండ సంపత్, మబ్బు వెంకటేష్, దీకొండ రమేష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్ల వల్ల కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని, దినసరి లేబర్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, బడా బాబుల చేతులో లేబర్ కోడ్ ఉండిపోతుందని ఆరోపించారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోతే కార్మిక ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

వీఆర్వో, వీఆర్‌ఏల సర్వీసు పరిగణలోకి తీసుకోవాలి

సుభాష్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇతర శాఖల్లో పనిచేసిన సర్వీసును పరిగణలోకి తీసుకోవాలని వీఆర్వో, వీఆర్‌ఏలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవోస్ రాష్ట్రఅధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖలకు బదిలీ చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారందరిని తిరిగి రెవెన్యూశాఖకు తీసుకుందన్నారు. తాము ఇన్నాళ్లు వివిధ శాఖల్లో అందించిన సర్వీసును పరిగణలోకి తీసుకోవడం లేదని, దాంతో తమకు ప్రమోషన్ల విషయంలో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సర్వీసును లెక్కించాలని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను కోరారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, రాగి శ్రీనివాస్, గంగారపు రమేశ్, పోలు కిషన్, గ్రామ పరిపాలన అధికారులు నారాయణ, గాలి బాలాజీ, పున్న పరిశయ్య, పిట్టల దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మ విశ్వాసం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అడిషనల్ డీసీపీ భీంరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్టులు, సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీంరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ప్రతి విద్యార్థి కరాటేలో శిక్షణ పొంది పటిష్టంగా తయారుకావాలని సూచించారు. ఈకార్యక్రమంలో 180 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఒకినావా చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్, కరాటే శిక్షకుడు పుల్లూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మారిన రోడ్డు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదా వరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన బిల్డింగ్‌కు వెళ్లే రహదారి గుంతల మయంగా మారడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తబిల్డింగ్‌కు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి నీళ్లు నిలిచాయి. నిర్మిస్తున్న ఐదు అంతస్థుల భవనం నుంచి నీళ్లు రహదారిపైకి రావడంతో గుంతలు పడింది. దీంతో అత్యవసర సమయాల్లో రోగులను తీసుకువచ్చే అంబులెన్స్‌తో పాటు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనబడక వాహనదారులు కింద పడుతున్నారు. అధికారులు రోడ్డు మరమ్మతులు చేయాలని రోగులు, వారి అటెండర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంతల మయంగా మారిన కొత్తబిల్డింగ్‌కు వెళ్లే రహదారి

మక్కాన్‌సింగ్ నియామకంపై సంబరాలు



ఖనిలో స్వీట్లు పంపిణీ, రామగుండంలో బాణాసంచా కాల్చుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను నియమించడాన్ని హర్షిస్తూ ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, మహంకాళి స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పోరాటాలు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కృషి చేస్తున్నాడన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, దీటి బాలరాజు, నాయిని ఓదెలు, ఫజల్ బేగ్, కొప్పుల శంకర్, గడ్డం శ్రీనివాస్, ముస్తాఫా, గట్ల రమేష్, పంజా శ్రీనివాస్, ఆడెపు దశరథం, మద్దెల శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రెండోసారి నియామకం కావడంపై రామగుండం, పాలకుర్తి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ చౌక్ వద్ద రామగుండం పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ ఆధ్వర్యంలో, అంతర్గాం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఇంచార్జి పెండ్రు హనుమాన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు టపాసాలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. మక్కాన్ సింగ్ భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని వారు కోరారు. కాంగ్రెస్ నాయకులు గురిమెట్ల రాజలింగం, పూదరి సత్తయ్యగౌడ్, సింగం కిరణ్ గౌడ్, ఆవుల గోపాల్ యాదవ్, ఓదెల రాజమౌళి, సిరిశెట్టి సతీష్, జూల లింగయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామకంపై ఆదివారం కాలనీలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండేటి రాజేష్ మాట్లాడుతూ మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషిని అధిష్టానం గుర్తించి రెండవసారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. సాగంటి శంకర్, సదానందం, మార్కరాజు, చక్రపాణి, అనుము రాములు, కేశవులు, రాజేష్, మహేష్, ఓదెల కుమార్, రాకేష్, సాదుల శ్రీనివాస్, సతీష్, రవీందర్‌రెడ్డి, కొమురయ్య, బాలు, యాదగిరి నాగరాజు, మహేందర్‌రెడ్డి, దేవయ్య, రమేష్, జంపయ్య పాల్గొన్నారు.

దుమ్ముతో ప్రయాణికుల ఇబ్బందులు

ముత్తారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఓడేడు నుంచి మంథని మండలంలోని గం గపురి వరకు రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణంతో దుమ్ము, ధూళితో గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 18 కిలోమీటర్ల ఈ రోడ్డు నిర్మాణం ఇటీవల ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు డోజర్‌తో చదును చేశారు. అయితే ఈ పనుల్లో భాగంగా తరుచూ నీళ్లు చల్లక పోవడంతో నిత్యం వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళి ఎగిసిపడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లారీ, బస్సు, ఇతర భారీ వాహనాలు ఈ మార్గం గుండా వచ్చిన క్రమంలో దుమ్ము, ధూళి ఎగిసి ఇం డ్లలో పడుతుందని, తినే పదార్థాలు, తాగే నీటిలోకి వచ్చి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే గాకుండా భారీ వాహనాలు వెళ్లే క్రమంలో ఆ పక్కన ఏదైన ద్విచక్ర వాహనంతో వెళ్తే కళ్లలో దుమ్ము పడి నానా ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు వాపో తున్నారు. ఇప్పటికైనా నిత్యం ఈ మార్గం గుండా నీళ్లు చల్లించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



బస్సు వెళుతుండగా లేచిన దుమ్ము

పల్లె పోరుకు సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

మంది ఎస్టీలు ఉన్నారు. సర్పంచ్ స్థానాలకు మండలంలోని జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ఖరారు చేసి మిగితావి జనరల్ స్థానాలకు చూపారు. వార్డు సభ్యుల స్థానాలకు గ్రామ జనాభా ఆధారంగా రిజర్వు చేశారు. ఇందులో 50 శాతం సీట్లు మహిళలకు డ్రా తీసి కేటాయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు ఆయా స్థానాల్లో 19.14 శాతం, ఎస్టీలకు 20.05, బీసీలకు 42 శాతం, జనరల్‌కు 36.80 సీట్లు కేటాయించారు. జిల్లాలోని 13 మండలాల్లోని అధికార యంత్రాంగం వారి పరిధిలో ఉన్న గ్రామ పంచా యతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు ప్రభుత్వ సూచన మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. దీన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీనిపై సోమ వారం సాయంత్రం వరకు స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే అనాధికారికంగా ఇప్పటికే 13 మండ లాల్లోని 263 గ్రామ పంచాయతీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మహిళ స్థానాల ఖరారు సమాచారం బహిర్గతం కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

జీవో నంబర్ 46ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న వివేక్

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 46 ను రద్దు చేసి జీవో నెంబర్ 9ని అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం స్టేట్ కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 40 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ బీసీలను నట్టేట, ముంచిందన్నారు. జీవో 46 ను ఉపసంహరించుకోవాలని లేకుంటే బీసీలంతా ఐక్య ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సామాజిక ఉద్యమకారుడు కోమటిపల్లి రాజేందర్ నేత బిసి సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి డాక్టర్ కాంకట శ్రీనివాస్ పాల్గొన్నారు

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బుచ్చయ్యపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు గుడిసె కాలిపోయి నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి ఎంపీ ఆర్థిక చేయూతను అందించారు. గ్రామానికి చెందిన ఆవుల సదయ్య కొనుగోలు కేంద్రంలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అతని భార్య వారి గుడిసెలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై గుడిసె కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీ గడ్డం వంశీ కృష్ణ రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాడె సూర్యనారాయణ ఆదివారం అందజేశారు.

ఆవుల సదయ్య కుటుంబాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు పరామర్శించారు. క్లబ్ మండల అధ్యక్షులు ఇప్ప మల్లేష ఆధ్వర్యంలో 3 వేల రూపాయల నగదు, బియ్యం, సరుకులు, బట్టలు అందించారు. తన్నీరు రాజేందర్, రవి, చంద్రకాంతరెడ్డి, నాడెం శ్రీనివాస్, నర్సింగం కడారి కుమార్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఖమ్మంపల్లి కార్యవర్గం

ముత్తారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఖమ్మంపల్లి కమిటీని ఎన్నుకున్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా దొమ్మటి రాజేందర్, ఉపాధ్యక్షుడిగా చింతం అనిల్, ప్రధానకార్యదర్శిగా మర్రి బానేశ్, కార్యదర్శి పంచిక మహేందర్, కోశాధికారిగా పర్శ అజయ్, అధికార ప్రతినిధిగా దాసరపు సంజీవ్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా కెక్కర్ల విశ్వరాంలు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.